ప్రజాశక్తి

మంగళవారం 5 డిసెంబరు 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా









కృష్ణాజిల్లా గుడివాడ వద్ద బారులు తీరిన ధాన్యం రవాణా వాహనాలు

అలజడి



కృష్ణాజిల్లా మొవ్వ మండలం అవిరిపూడిలో నీట మునిగిన పనలు

- బందరులో ఏడో నంబర్ ప్రమాద హెచ్చరిక
- వర్షాలు, ఈదురుగాలులు ప్రారంభం
- ముందుకు చొచ్చుకు వచ్చిన సముద్రం
- 10 మీటర్ల ఎత్తుకు ఎగసిపడుతున్న అలలు
- మచిలీపట్నం, అవనిగడ్డల్లో ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు
- 63 పునరావాస కేంద్రాలకు 3,228 మంది తరలింపు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన పెనుతుపాను మిచౌంగ్ మచిలీపట్నం వైపుగా దూసుకోస్తోంది. మచిలీపట్నానికి 320 కిలో మీటర్ల దూరంలో కేంద్రకృతమై ఉంది. ఇది గంటకు 14 కిలోమీటర్ల వేగంతో కుదులుతూ మంగళవారం తీరాన్ని దాటుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్‌లో ఏడో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఇప్పటికే దీని ప్రభావంతో సోమవారం తెల్లవారుజామునుంచి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా సగటున అన్ని మండలాల్లోనూ 20.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో భారీ వర్షం మొదలైంది. సముద్రం వెంబడి 60-70 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. మచిలీపట్నం, కోడూరు, కృత్తివెన్ను మండలం తదితర ప్రాంతాల్లో సముద్రం 10 మీటర్లు ముందుకు చొచ్చుకు వచ్చింది. సాధారణ పరిస్థితుల్లోకన్నా మీటరున్నర ఎత్తు అదనంగా అలలు ఎగిసిపడుతున్నాయి. తీర ప్రాంతం దివిసీమలోని కోడూరు, నాగాయలంక మండలాల్లో తీర ప్రాంత గ్రామాలు ఊటగుండం, రామకృష్ణాపురం, పాలకాయతిప్ప, బసవన్నపాలెం, ఇరాలి, చింతకోళ్ల, ఎదురుమొండి, ఎలిచెట్లదిబ్బ, కృత్తివెన్ను మండలం చినగొల్లుపాలెం, మచిలీపట్నం మండలం పెదపట్నం, మంగినపూడి, పోలాటితిప్ప తదితర గ్రామాల్లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తీర ప్రాంతంలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు (మిగతా 6లో)

సహాయక చర్యలు చేపట్టాలి : సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

తుపాను సహాయక చర్యలు చేపట్టి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తుపాను ప్రభావం జిల్లాపై ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాల్లోని ప్రజలను, పోర్టు నిర్మాణానికి, ఇతర ఉపాధి అవసరాలకు జిల్లాకు వచ్చిన వలస కార్మికులను పునరావాస శిబిరానికి తరలించి వారికి అవసరమైన వసతి, ఆహారం, తాగునీటి (మిగతా 6లో)

144 రైళ్లు రద్దు, 24 ఆర్‌టిసి బస్సులు రద్దు

తుపాను ప్రభావంతో విజయవాడ రైల్వే జంక్షన్ మీదుగా వెళ్లే 144 రైళ్లను రైల్వే అధికారులు రద్దు చేశారు. మరికొన్ని రైళ్లలను దారి మళ్లించారు. అలాగే ఎపిఎస్ ఆర్‌టిసి వారు పలు రూట్లలో వెళ్లాల్సిన 24 సర్వీసులను నిలుపుదల చేశారు. వీటిలో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు కూడా ఉన్నాయి. విజయవాడ రైల్వేస్టేషన్, బస్టాండ్లలో హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేశారు.

నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం రాత్రి 8.10 గంటలకు నిలిచిపోయిన సరఫరా రాత్రి 10 గంటలకు కూడా పునరుద్ధరణ కాలేదు. అలాగే కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ తందితర మండలాల్లోనూ విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. దీంతో సముద్రతీర ప్రాంతాల ప్రజులు బిక్కుబిక్కుమంటున్నారు.



రైళ్లు రద్దు కావడంతో బోసిపోతున్న విజయవాడ రైల్వేస్టేషన్

రాజధాని రైతులకు ఊరట

- అమరావతి మాస్టర్‌ప్లాన్‌కు ఆమోదం
- మూడు రాజధానుల ప్రస్తావన లేదు
- పార్లమెంట్లో కేంద్రం ప్రకటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నాలుగేళ్లుగా ఉద్యమిస్తున్న రాజధాని అమరావతి రైతులకు భారీ ఊరట లభించింది. అమరావతి ఏకైక రాజధానిగా గుర్తించామని, మూడు రాజధానుల ప్రతిపాదనకు తమ ఆమోదం లేదని కేంద్రం సోమవారం రాజ్యసభలో ప్రకటించింది. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగానే అమరావతి మాస్టర్ ప్లాన్‌కు కూడా ఆమోదం తెలిపామని, ఇందులో ఎటువంటి మార్పులు లేవని పేర్కొంది. ఈ ప్రకటనతో అమరావతి రైతుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. దేశంలోని 26 రాష్ట్రాలకు రాజధానుల జాబితాను విడుదల చేయగా, ఇందులో ఎపికి అమరావతినే రాజధానిగా గుర్తించింది. 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ఎంపిక చేస్తూ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఎ)ను ఏర్పాటు చేసింది. సిఆర్‌డిఎ ద్వారా రాజధాని నిర్మాణానికి 34 వేల ఎకరాల భూమిని సమీకరించింది. భూ సమీకరణ విధానం ద్వారా రైతుల నుంచి తీసుకున్న భూములకు ప్రతిగా గృహ అవసరాల, వాణిజ్య అవసరాల వినియోగం నిమిత్తం రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చేలా రైతులతో సిఆర్‌డిఎ ఒప్పందం చేసుకుంది. మొత్తం 34వేల ఎకరాల భూమికి 54వేల రిటర్నబుల్ ప్లాట్లను ఏర్పాటు చేస్తూ రాజధాని గ్రామాల్లో లేఅవుట్లను ఏర్పాటు చేసింది. వీటిని మూడేళ్లలో అభివృద్ధి చేసి ఇస్తామని అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రకటించింది. 2019లోగా రిటర్నబుల్ ప్లాట్లను రైతులకు అప్పగించకుండానే టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని విస్మరించింది. ఆరు నెలలు కాలయాపన చేసిన తర్వాత 2019 డిసెంబరు 17న అసెంబ్లీలో మూడు రాజధానుల బిల్లును ప్రవేశపెట్టింది. బిల్లు ఆమోదం పొందిన తర్వాత రాజధాని రైతులు ఉద్యమబాట పట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు నాలుగేళ్ల నుండి ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. వివిధ దశల్లో



న్యాయపోరాటం చేశారు. సుదీర్ఘకాలం విచారణ తర్వాత గత ఏడాది మార్చి 3న మూడు రాజధానుల చట్టాన్ని కొట్టివేస్తూ అమరావతిని ఆరునెలల్లోగా అభివృద్ధి చేయాలని హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాజధాని అభివృద్ధిపై కాలపరిమితి విధించడం సరికాదని పేర్కొంటూ ఈ అంశంపైనే సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. కానీ మూడు రాజధానుల చట్టం రద్దు, రైతుల ఇతర డిమాండ్లపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వకుండా విచారణ కొనసాగిస్తామని ప్రకటించింది. ప్రస్తుతం అటు రైతులు, ఇటు ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరగాల్సి ఉంది. సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉండగానే గత నాలుగు నెలలుగా పలు దఫాలుగా విశాఖపట్నం పరిపాలన రాజధానిగా పేర్కొంటూ అక్కడికి తరలివెళ్లేందుకు సిఎం జగన్ పలు తేదీలు ప్రకటించినా ఆచరణ సాధ్యంకాలేదు. మరో మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పుల (మిగతా 6లో)

ధాన్యం దిగుమతి చేసుకోండి మహాప్రభో

- రైస్ మిల్లుల వద్ద బారులు తీరిన వాహనాలు
- రైతులు పడిగాపులు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిది

ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొస్తున్న తరుణంలో ముంచుకొస్తున్న తుపాను అన్నదాతల పాలిట శాపంగా మారింది. విపత్కర పరిస్థితుల్లోనూ రవాణా చేసిన ధాన్యం మిల్లుల వద్ద దిగుమతి చేసుకోవడానికి నిరాకరిస్తుండటంతో రైతులకు దిక్కుతోచడంలేదు. శనివారం మిల్లులకు పంపిన ధాన్యం సోమవారం సాయంత్రానికి కూడా దిగుమతి కాకపోవడంతో గుడివాడ-విజయవాడ, గుడివాడ-బంటుమిల్లి రోడ్లలోని మూడు రైస్ మిల్లుల వద్ద రోడ్లపై వందలాది వాహనాలు బారులు తీరాయి. జిల్లావ్యాప్తంగా పలు మిల్లులు వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాల్లో మొత్తం 154 రైస్ మిల్లులకుగాను 54 మిల్లుల్లో మాత్రమే పచ్చి ధాన్యం ఆరబెట్టే డ్రయర్లు ఉన్నాయి. తుపాను నేపథ్యంలో తేమశాతం ఎక్కువ ఉన్న పచ్చి ధాన్యాన్ని నూర్చినవి నూర్చినట్లు మిల్లులకు తరలిస్తున్నారు. గత నాలుగు రోజుల్లోనే 10 వేల టన్నులపైగా తరలించారు. దీంతో మిల్లుల్లో గోదాములు నిండిపోయాయని మిల్లర్లు చెపుతున్నారు. జిల్లా అధికారులు తేమశాతంతో సంబంధంలేకుండా ధాన్యం తీసుకోవాలని చెపుతున్నా మిల్లర్లు అందుకు నిరాకరిస్తున్నారు. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో ధాన్యం రోడ్లపైన, కల్లాల్లో ఉండిపోయింది. రైతులు పట్టాలను కప్పి తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే వర్షానికి భూమిలో తేమ ఎక్కువై ధాన్యం నాణ్యత దెబ్బతింటోందని రైతులు వాపోతున్నారు. దీనికితోడు రైస్ మిల్లుల వద్ద లోడ్లు సకాలంలో దిగుమతి కాకపోవడంతో ధాన్యం రవాణాకు వాహనాలను పంపేందుకు యజమానులు నిరాకరిస్తున్నారు. తొలుత జిపిఎస్ పరికరాలు అమర్చని వాహనాల్లో ధాన్యం తరలించడానికి అనుమతి ఇవ్వకపోవడం సమస్యగా మారింది. తుపాను నేపథ్యంలో సడలింపు ఇచ్చినా ఒక్కసారిగా మిల్లులకు వెళ్లిన ధాన్యం దింపుకోవడానికి గోదాముల్లో ఖాళీ లేకుండా పోయింది.

15 వేల ఎకరాల్లో నీట మునిగిన వరి పనలు

వర్షాల కారణంగా పామర్రు, మొవ్వ, ఘంటసాల తదితర మండలాల్లో ప్రతి గ్రామంలో సగటున 50 నుండి 100 ఎకరాల్లో కూలీలతో కోత కోయించిన వరి పనలు నీట మునిగాయి. జిల్లావ్యాప్తంగా 15 వేల ఎకరాలు వరి కోత కోసి పనులపై ఉంది. నీటిలో నానుతున్న ధాన్యం కంకులు మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రంలోనూ కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

ప్రజాశక్తి-గుడివాడ : తెలంగాణా ప్రజలను మోసం చేసిన కెసిఆర్‌కు పట్టిన గతే ఎపిలో కూడా జగన్‌మోహన్ రెడ్డి కి కూడా వస్తుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చే ఎన్నికల్లో చూస్తారని కాంగ్రెస్ పార్టీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జి శిష్టా దత్తాత్రేయులు అన్నారు. సోమవారం స్థానిక కిన్నెర కాంప్లెక్స్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ




రాహుల్ గాంధీ జోడ్ యాత్ర ఫలితంగా తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ అధికారం సాధించిందన్నారు. దేశంలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మన రాష్ట్రంలో జగన్‌కు కూడా కెసిఆర్ ఏవిధంగా ఓటమి పాలయ్యారో అదే విధంగా జగన్ కూడా ఓడిపోవడం జరుగుతుందన్నారు. మన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

500వ రోజుకు అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-మైలవరం: పేదవాడి ఆకలి తీర్చాలన్న చంద్రబాబు ఆకాంక్షతో మైలవరంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశామని మాజీ



మంత్రి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వర అన్నారు. మైలవరంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి 500 రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం కేక్ కట్ చేసి అన్నార్తులకు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని అన్నారు. జగన్ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్ భవనాలను మూలనపెట్టి లిక్కర్ షాపులుగా మార్చారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక మండలానికి ఒక అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తామన్నారు.



న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-నందిగామ: కోర్టు విస్తృత అధికారాలను, రాజ్యాంగ హక్కులకు నష్టం కలిగించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో నెంబర్ 27/2023ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నందిగామ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నందిగామ ఆర్డీవో సాయిబాబాకు వినతిపత్రం అందజేశారు. హైకోర్టు న్యాయవాది ఎక్కిరాల హనుమంతరావు, న్యాయవాది ఆంజనేయులు, కట్టా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగ హక్కులను కాపాడాలని, ప్రజలకు కక్షిదారులకు భంగం కలిగించే జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

'వికలాంగులు అన్ని రంగాల్లో రాణించాలి'

ప్రజాశక్తి మైలవరం: వికలాంగులు అన్ని రంగాల్లోనూ రాణించాలని మండల విద్యాశాఖ అధికారి బాలు అన్నారు. అంతర్జాతీయ



వికలాంగుల దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక భవిత సెంటర్లోని వికలాంగులకు మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయసుధ ఆధ్వర్యంలో వాటర్ బాటిల్స్ అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతులు పవన్‌కుమార్, లతా శ్రీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీచర్ కనకదుర్గ, దారా మాధవి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు వితరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్



అధ్వర్యంలో నడుస్తున్న అన్న క్యాంటీన్ కు వత్సవాయి మండలం టిడిపి మాజీ అధ్యక్షులు జొన్నలగడ్డ రాధాకష్ణ మూర్తి 9 మంచి నూనె టీన్స్ ను అన్న క్యాంటీన్ భోజన కార్యక్రమానికి వితరణగా అందజేశారు. ఈ మంచి నూనె టీన్స్ ను రాజగోపాల్ చేతుల మీదుగా అన్న క్యాంటీన్ నిర్వహకులు మైనేని రాధాకష్ణ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో నంబూరి శ్రీనివాసరావు, బొల్లా వెంకటేశ్వరరావు, నకిరకంటి వెంకట్, అన్నెపాక దుర్గ మహేశ్వరరావు, సూరా సతీష్ పాల్గొన్నారు.

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలి
తంగిరాల సౌమ్య

ప్రజాశక్తి- నందిగామ

మిచౌంగ్ తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందిగామ మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తీరం దాటే అవకాశం ఉందని ఏపీ విపత్తుల వారి నుండి సమచారం అందుతుంది కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఏటిపట్టు గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని, ప్రభుత్వం, అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.



ఘంటసాల జయంతి

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ సుందరయ్య భవనంలో సోమవారం ఘంటసాల 101వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ గ్రంథాలయ ఉద్యోగి, కళా పిపాసి అవిర్నేని వెంకటేశ్వరరావు ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మదినోత్సవ కార్యక్రమం జరుపుకోవడం మా అదష్టం గా భావిస్తున్నానన్నారు. ఆయన చౌటపల్లి స్కూల్లోనే సెకండ్ ఫారం వరకు చదువుకున్నారన్నారు. ఎక్కడ సంగీత కచేరీలు ఉంటే అక్కడికి వెళ్లి సంగీతాలు పాడేవాడన్నారు. అంతే కాకుండా ఈయన డాన్స్ నేర్చుకున్నారన్నారు. అందుకని ఈయన ఎన్నో కష్టములు పడి ఆ సంగీతం నేర్చుకున్నాడు సంపాదించాడు జన్మదినోత్సవం సందర్భంగా ఆర్టీసీ కండక్టర్ గా పనిచేస్తున్న ఎం శ్రీనివాసరావు ఘంటసాల గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ సి పి రెడ్డి, నీలం మురళీకష్ణా రెడ్డి, పి పూర్ణచంద్రరావు, పి రజిని, టి జి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



డిసిపికి 71 ఫిర్యాదులు

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో సోమవారం ఈస్ట్ డి.సి.పి. విశాల్ గున్ని స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి, బాధితులు నుండి వివిధ సమస్యలు, వినతులను స్వీకరించారు. విజ్ఞప్తులకు సంబంధించి నేరుగా భాదితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలను సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓలకు ఫోన్ ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వచ్చిన ఫిర్యాదుల్లో నగదు లావాదేవీలకు సంబంధించినవి 16 ఫిర్యాదులు, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 16 ఫిర్యాదులు, సివిల్ వివాదాలకు సంబంధించినవి 12 ఫిర్యాదులు, వివిధ మోసాలకు సంబంధించినవి 9 ఫిర్యాదులు, ఇంటి అద్దె విషయం సంబంధించినవి 2 ఫిర్యాదులు, త్వరితగతిన పరిష్కరించాల్సిన కేసులకు సంబంధించి 1 ఫిర్యాదు, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలుకు, సంఘటనలకు సంబంధించినవి 15 ఫిర్యాదులు, మొత్తం71 ఫిర్యాదులును డిసిపి విశాల్ గున్ని స్వీకరించారు.



షాబాజ్‌కు ఎంఎల్ఎ అభినందన

ప్రజాశక్తి-నందిగామ

జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైన విద్యార్థి షాబాజ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు సోమవారం అభినందించారు. విజయవాడలోని నలంద స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో నందిగామ పట్టణానికి చెందిన షఫ్వాన్ షాబాజ్ పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ విద్యార్థిని అభినందించి జాతీయస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

రంగస్థల కళాకారులకు సన్మానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: గానగంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలో హైదరాబాద్ రోడ్డులో ఘంటసాల విగ్రహానికి పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఘంటశాల, బాలు కళారాధన సేవా సమితి అధ్యక్షులు మీసాల బాబ్జి, జగ్గయ్యపేట గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కలువకొలను ఆంజనేయ శర్మ, ప్రైవేట్ స్కూల్స్ డివిజన్ ప్రెసిడెంట్ కొమరగిరి భరద్వాజ్, శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయ ప్రధాన కార్యదర్శి కొండూరు వెంకట నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళుల అర్పించారు. ఈ సందర్భంగా రంగస్థల రంగానికి విశేష సేవలు అందించిన కళాకారులు హార్మోనిస్ట్ సంజీవరావు, కళాకారిణి కాల్వ అరుణలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అబ్బాస్ ఆలీ, కాంతారావు, సామియేలు, కృష్ణమూర్తి, చిన్నికృష్ణ పాల్గొన్నారు.





ఈలప్రోలులో జగనన్న కాలనీకి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఈలప్రోలు గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్‌లో గుంటుపల్లి గ్రామానికి చెందిన మూడో ఆప్షన్ ఎంచుకున్న లబ్ధిదారులతో మండల వైసిపి నాయకులు పాలడుగు దుర్గాప్రసాద్ సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ నాగరాజు, ఫీల్డ్ ఆఫీసర్ లావణ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర వాయిదా

ప్రజాశక్తి-నందిగామ: నందిగామలో ఐదో తేదీన నిర్వహించాల్సిన సామాజిక సాధికార బస్సు యాత్రను తుపాన్ కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల పదో తేదీన బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పదో తేదీన బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కంచికచర్ల: ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆఫ్ కౌన్సిల్, హైదరాబాద్, ఖమ్మంకు చెందిన గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్, గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని పెండ్యాల గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మాజీ కౌన్సిలర్ అంజమ్మ మృతి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణ పదో వార్డు మాజీ కౌన్సిలర్ పులవర్తి అంజమ్మ (75) సోమవారం అనారోగ్యంతో


నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ

మృతిచెందారు. నందిగామ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది పులివర్తి కోటేశ్వరరావు తల్లి అంజమ్మ అనారోగ్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతున్నారు. అంజమ్మ భౌతికకాయాన్ని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్‌మోహన్‌రావు, మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య, నందిగామ ఎఎంసి చైర్మన్ మస్తాన్, నందిగామ ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు సందర్శించి నివాళులర్పించారు. అలాగే సీనియర్ న్యాయవాదులు కాట్రా సత్యనారాయణ, హైకోర్టు న్యాయవాది ఎక్కిరాల హనుమంతరావు, కొమ్మినేని మౌళేశ్వరావు, బొడ్డు వెంకటేశ్వరరావు, గుర్రాల వెంకటరత్నం పలువురు న్యాయవాదులు నివాళులర్పించారు.

ఏడో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ


పునరావాస కేంద్రాలు పరిశీలిస్తున్న జెసి


బాధితులకు భోజనం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో మచిలీపట్నం మండలంలో 22 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశారు. మచిలీపట్నంలో 7 నంబరు ప్రమాద హెచ్చరికను జారీచేశారు.అధిక వర్షాలు పడుతున్నాయి సముద్ర తీరం వెంబడి ఉన్న పెదపట్నం, కానూరు, తాళ్లపాలెం, మంగినపూడి, కెపిటి పాలెం, వాడ పాలెం, కోన, పోలాటితిప్ప, పల్లేతుమ్మలపాలెం, గిలకల దిండి, గరాలదిబ్బ, చిన్నాపురం తదితర గ్రామాలలో భోజన వసతులు ఏర్పాటు చేశారు.18 మత్స్యకార గ్రామాలతో పాటు లోతట్టు గ్రామాలలోతో కలిపి 22 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశారు.ప్రమాద బరితంగా ఉన్న 288 కుటుంబాలను 5925 మందిని గుర్తించడం జరిగింది. ఇప్పటికే 1472 మందిని శిబిరాలకు తరలించారు. ఇంకా 4453 తరలించాల్సి వుంది అని అధికారులు తెలుపుచున్నారు. ప్రతి శిబిరం ఏ విదమైన ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామని భోజన వసతులతో పాటు పిల్లలకు పాలు, శిబిరానికి వక అధికారిని, మెడికల్ సిబ్బందిని, పోలీస్ సిబ్బంది ఏర్పాటు చేశామని ప్రత్యేకాధికారి జివి సూర్య నారాయణ తెలిపారు. గిలకలదిండిలోని పునరావాస శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. భోజన వసతులు,ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. శిబిరాల వద్ద అధికారులు అప్రమత్తంగా వుండాలని ఏ విధమైన ఇబ్బంది వచ్చినా సమాచారం అందించాలని ఆదేశించారు.


మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

పునరావాస కేంద్రం ఏర్పాటుచేయాలి

- మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామమైన రామకృష్ణాపురం గ్రామంలో సోమవారం మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ పర్యటించారు. ఈ సందర్భంగా గత రెండు రోజుల నుంచి తుఫాన్ ప్రభావం కనిపిస్తున్నప్పటికీ మా గ్రామంలోని ప్రజలను ఇంతవరకు ఏ ఒక్క అధికారి పలకరించలేదని గ్రామస్తులు బుద్ధ ప్రసాద్ వద్ద వాపోయారు. ఈ విషయంపై స్పందించిన మండలి రామకష్ణాపురం గ్రామంలో 1977 తుఫాన్ కి వందలాది మంది చనిపోయారని, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రహదారుల కమ్యూనికేషన్ ప్రధానమని అన్నారు. రామకష్ణాపురం నుంచి కోడూరు వెళ్ళు ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏ ఒక్క రహదారి కూడా నిర్మాణం చేపట్టలేదన్నారు. తీర ప్రాంత గ్రామాలకు పరిరక్షణగా ఉన్న సముద్రపు కరకట్ట పూర్తిగా శిథిలమైందని గత కొద్ది రోజుల క్రితం కరకట్టను ప్రతిష్ట పరచాలని పాదయాత్ర చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకున్న పరిస్థితి లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తీర ప్రాంత గ్రామ ప్రజల సంరక్షణ కోసం రామకృష్ణాపురం గ్రామంలో రిలీఫ్ క్యాంప్ ఏర్పాటు చేయాలని కోరారు.


పునరావాస బాధితులకు ఆహారం అందిస్తున్న నాయకులు

సురక్షిత ప్రాంతాలకు తరలింపు

ప్రజాశక్తి-చల్లపల్లి : తుఫాను నేపథ్యంలో శాసన సభ్యులు సింహాద్రి రమేష్ బాబు సూచన మేరకు నిరుపేద ఎస్టీలను సురక్షిత ప్రాంతానికి చేర్చినట్లు వైసిపి చల్లపల్లి మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యనారాయణ (నాని) అన్నారు. సోమవారం చల్లపల్లి మండలం లక్ష్మీపురం ఎస్టి కాలనీ పాకల్లో జీవిస్తున్న 30 మందికి ఎంపీపీ పాఠశాలలో పునరావాసం కల్పించారు. వారికి ఆహారం, తాగునీరు సమకూర్చారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు వారికి ఇక్కడ సహాయక చర్యలు, ఆహారము, తాగునీరు, మందులు అందిస్తామని నాని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, విఆర్ఓ కోట కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్లపైనే ధాన్యం...రైతన్నల దైన్యం


కంకిపాడు మండలంలో రోడ్ల మీద ధాన్యం

ప్రజాశక్తి-గన్నవరం : తుఫాను హెచ్చరికలతో గన్నవరం మండలం లోని రైతులకు కంటిమీద కునుకు లేకుండాపోయింది. సోమవారం కురిసిన వర్షంతో పాటు వీచిన గాలులకు చేతికొచ్చిన పంట నేలవాలుతుందని ఆందోళన చెందుతున్నారు. దావాజీ గూడెం కేసరపల్లి, సావరగూడెం ముస్తాబాద్, వీరపనేని గూడెం, చిక్కవరం గ్రామాల్లో కొంత మంది వారం నుంచి పంటను యంత్రాలతో కోసి ఆరబెట్టుకుంటున్నారు. ఎండ లేకపోవడంతో ధాన్యం ఆరడం లేదు. తేమ శాతం ఎక్కు వగా ఉందని ఆర్బీకే అధికారులు కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. రోడ్లమీద దాన్యం ఆరబోసి పరదాలు కప్పి తడవకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సందర్భంగా లారీల కొరత, జిపిఎస్ నిబంధనల కొరత పట్టిపీడిస్తోంది. లారీలు రాక రోడ్డు పక్కనే ధాన్యం బస్తాలతో నెట్టు వేసుకోవడం, అరబెట్టుకోవడం కొనసాగుతోంది. కొంతమంది గొల్లనపల్లి, పురుషోత్తపట్నం, వీరపనేని గూడెం సమీపంలోనే మిల్లర్లను బతిమాలి వారి ఆవరణలో భద్రపరుచుకున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ఆరుబయట ఆరబోసిన ధాన్యమును యుద్ధ ప్రాతిపదికన మిల్లర్లకు తరలించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** తుఫాను కారణంగా పమిడిముక్కల మండలంలోని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల రైతులు ధాన్యాన్ని ఆర్‌బికె కేంద్రాలకు తరలిస్తున్నారు. ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ రైతులకు సూచించారు.లారీల్లో ఆర్‌బికెలకు తరలిస్తున్న ధాన్యాన్ని ఎంఎల్ఎ పరిశీలించారు.

రైతులను ముంచిన తుపాను

- వర్షాలకు నీటిలో నానుతున్న వరి పనలు
- రైతన్నల ఆందోళనలు


ఉయ్యూరు మండలం గండిగుంట పొలాల్లో వరిపనలలో నిలిచిన నీరు

ప్రజాశక్తి-ఉయ్యూరు : తుఫాన్ ప్రభావంతో సోమవారం తెల్లవారు ఝామునుండి కురుస్తున్న వర్షం, వీస్తున్న గాలులు రైతులకు తీవ్ర నష్టం కలుగజేశాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొస్తున్న సమయంలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి చాలా వరకు కోతకోసి పొలాల్లో పనలపై ఉన్న వరిపంట తడిసి నీళ్లలో నాను తుంది. మెషిన్తో కోత కోయించి రోడ్లపక్కన ఆరబెట్టిన ధాన్యం చాలావరకు మిల్లులకు తోలగా, లారీల్లో లోడు చేసేందుకు కూలీలుదొరకక మరికొంతమేర రాశులు చేసి, సం చుల్లోకి ఎత్తి వర్షానికి తడవకుండా పట్టాలు కప్పి రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి వరకు వర్షం లేకపోవడంతో కొంతమేర వరి పనలు మోపులు కడుతున్న సమయంలో వర్షం ప్రారంభం కావడంతో మధ్యలో నిలిపివేసిన పరిస్థితి ఏర్పడింది. కాగా మండల పరిధిలో సోమవారం 23 లారీల్లో ధాన్యం మిల్లులకు చేరవేసినట్టు తహసీల్దార్ కె మస్తాన్ తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాముల్లో ధాన్యం నిల్వచేసుకోవచ్చు

ధాన్యం సంచులకెత్తి మిల్లులకు తోలే అవకాశం లేక రోడ్లపక్క లాటువేసి పట్టాలు కప్పి న రైతులు ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గోదాముల్లో నిల్వ చే సుకోవచ్చని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు తెలిపారు. తుఫాన్ ప్రభావంవల్ల రైతులు నష్టపోకూడదన్న ఉద్దేశంతో గోదాముల్లో ఉచితం గా నిల్వ చేసుకునేందుకు కల్పించిన అవకాశం సద్వినియోగం చేసుకో వాలని పేర్కొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** తుఫాన్ కారణంగా ఈదురు గాలులు, వర్షం కారణంగా మండలం లోని రైతులకు తీవ్ర నష్టం ఏర్పడింది. మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో సుమారు 300 ఎకరాల కోత కోసి ధాన్యం రోడ్లపై వున్న ధాన్యం తడిచిపోయాయి. అలాగే కొన్నిచోట్ల గాలులకు వరి పంట పడిపోవడంతో ఒడ్డుమొక్క వచ్చే పరిస్థితి ఏర్పడింది. అంగలూరు, విన్నకోట, శేరి కల్వపూడి గ్రామాల్లో మిషన్ల తో కోసిన పంటను చాలావరకు ఆర్ బి కే కేంద్రాల ద్వారా తరలించగా కొంత దాన్యం రోడ్డుపై పరదాలు కప్పి ఉంచారు. సోమవారం మండల వ్యవసాయ అధికారి సునీల్, వీఆర్వో లక్ష్మయ్య, స్వామి, జిల్లా వ్యవసాయ సలహా మండల సభ్యులు పెన్నేరు ప్రభాకర్ రావు, నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. **పజాశక్తి-చల్లపల్లి :**తుఫాను రైతులకు శాపంగా మారింది. ఆరు గాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి ఈదురు గాలులు, వర్షం రావటంతో అన్నదాతల గుండెల్లో తీవ్ర అలజడులు మొదలయ్యాయి. మండలంలో వెలివోలు, యార్లగడ్డ, వక్కలగడ్డ గ్రామాలలో కోతలు కోసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పొలాలలో నీరు చేరటంతో వరి పనులు నీటిలో తేలియడుతున్నాయి.ఈదురు గాలులకు పైరు పడకేసింది. ఇదే కొనసాగితే మా పరిస్థితి ఏమిటాని రైతులు విచారం వ్యకం చేస్తున్నారు. **ప్రజాశక్తి -మొవ్వ :** "మిచౌంగ్" తుఫాను పుణ్యమా అని కురుస్తున్న వర్షం వీస్తున్న ఈదురు గాలులు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. వాతావరణ శాఖ సోమవారం తుఫాను తీరం దాటే ప్రాంతాలపై చేస్తున్న ప్రకటనలు రైతులలో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం నాటికి మచిలీపట్నం, చిన్నగొల్లపాలెం, దివిసీమ, ప్రాంతాలలో ఒకచోట తీరందాటుతుందని వాతావరణ శాఖ చేస్తున్న రకరకాల ప్రకటనలుతో రైతులలో అయోమయ నెలకొంది. మొవ్వ మండలంలో సోమవారం వేకువజాము(4 గంటల ప్రాంతం) నుంచీ కురుస్తున్న వర్షం సాయంత్రానికి సుమారు నాలుగు మిల్లీమీటర్ల వరకు నమోదయింది. ఈనేపథ్యంలో కురిసిన వర్షం తక్కువే అయినా ఆదివారం నుంచి విపరీతమైన గాలులు వేయటంతో పలు ప్రాంతాలలో వరి పైరుచాప చుట్టలా పడిపోయింది. దీనితో పడిపోయిన వరిపై వర్షపు నీరు కూడా చేరిన సంఘటనలు ఉన్నాయి. అదేవిధంగా కొన్ని ప్రాంతాలలో వరి పనుల్లోకి నీరు చేరింది. ఇప్పుడే ఇలా ఉంటే తీరం దాటిన తర్వాత కురిసే వర్షాలతో తమ పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేసుకోవచ్చునని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **ప్రజాశక్తి పెదపారుపూడి :** ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుఫాను ప్రభావంతో రైతులకు రక్షించుకోలేని పరిస్థితి ఏర్పడింది. తుపానుతో కురుస్తున్న వర్షాలకు ఆందోళనకు గురవుతున్నారు. మిషన్లతో కూసిన వరి పంటను రహదారులపై ఆరబెట్టుకుని తేమ తగిన త్వరగా అనుకుంటే ఈ తుఫాను ప్రభావం రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది


గుడ్లవల్లేరు మండలంలో పడిపోయిన వరి


మొవ్వ మండలంలో వరిపనల్లోకి చేరిన నీరు


కంకిపాడులో నేలకొరిగిన వరిపంట

పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు



నెలనెలా జీతాలివ్వండి...

ప్రభుత్వాసుపత్రి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: స్థానిక కొత్త ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర సిఐటియు తూర్పు నగర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి పారిశుధ్య సెక్యూరిటీ గార్డ్స్ సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు తూర్పునగర అధ్యక్ష కార్యదర్శులు వి.బి.రాజు, ఎన్.కోటబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి పారిశుధ్య సెక్యూరిటీ గార్డ్స్‌కు గత రెండు నెలల నుంచి జీతాలు అందలేకపోవడం వల్ల వారు అనేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. పెరిగిన నిత్యవసర వస్తువులు కరెంటు చార్జీలు బస్సు చార్జీలతో ఇబ్బందులు పడుతుంటే నెలనెలా జీతాలివ్వకుంటే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండ్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ కాంట్రాక్టర్‌తో మాట్లాడి జీతభత్యాలు ఇప్పించే విధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల అధ్యక్ష కార్యదర్శులు భాస్కరమ్మ, తిరుపతమ్మ, అఖిల, కుమారి, కోటేశ్వరమ్మ, పద్మ, సెక్యూరిటీ గార్డ్స్ నాయకులు సునీత, సుజాత, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేతల స్వార్థం కోసం కులాల మధ్య చిచ్చు

ప్రముఖ పత్రికా సంపాదకులు సతీష్ చందర్

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి బీ కాలనీ ఆధ్వర్యంలో బ్లూవింగ్స్ ఆధ్వర్యంలో 'కులాలే పార్టీలా కుల నిర్మూలన ఎలా సాధ్యం'



అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు సోమవారం నిర్వహించారు. బ్లూవింగ్స్ చీఫ్ టెక్నికల్ అండ్ లీగల్ అడ్వైజర్ బోయపాటి సుధీర్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రముఖ పత్రికా సంపాదకులు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ పొలిటికల్ లీడర్షిప్ వ్యవస్థాపకుడు సతీష్ చందర్ పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కాన్షీరాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సతీష్ చందర్ మాట్లాడుతూ నేటి రాజకీయ వ్యవస్థలో నేతలు కేవలం తమ స్వార్థం కోసం కులాల మధ్య చిచ్చులు పెడుతున్నారన్నారు. దీంతో కోట్లు, సీట్లు తప్ప ప్రజలు పడే పాట్లు చూడటం లేదన్నారు. అట్టడుగు స్థాయి వర్గాల్లో సామాజిక ఉద్యమాలు అనేకం వచ్చాయని, అన్ని సామాజిక ఉద్యమాలు రాజకీయ ఉద్యమాలు కాలేకపోయాయని తెలిపారు. రాజకీయ పార్టీలు కార్పొరేట్ వ్యవస్థల చట్టంలో ఇరుక్కోవడంతో ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగాలను సైతం ప్రైవేటు రంగాలు శాసించే స్థాయికి నేటి వ్యవస్థలు వచ్చాయని ఎద్దేవా చేశారు. కులాల ప్రాధాన్యత పార్టీలు పెరుగుతున్న నేపథ్యంలో కుల నిర్మూలన జరగాలంటే, అంబేద్కర్ ఆశించిన ఫలాలను అందుకోవాలంటే ప్రజలందరూ అంబేద్కర్‌ను పూజించటం కాకుండా ఆయన భావజాలంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కుతో పాటు ఓటర్ హక్కు కూడా సాధించాలంటే ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లూవింగ్స్ ఫౌండేషన్ ఎంవిఎస్‌సి చీఫ్ అడ్వైజర్ డా. సిహెచ్ శివరామకృష్ణారావు, వ్యవస్థాపక అధ్యక్షులు పులి మల్లికార్జునరావు, పంతగాని రమేష్, డాక్టర్ సహనం, వినయ్ కుమార్, సత్యనారాయణ, దేవరాజు, వెన్నపు సుధాకర్, గౌరీ, కిషన్ చందర్ పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో అప్రమత్తం

ప్రజాశక్తి-వన్‌టౌన్: కొండ ప్రాంతంలో నివసించే ప్రజలను టూటౌన్ పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు. సోమవారం టూటౌన్ సిఐ



సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు, సిబ్బంది ఆంజనేయవాగు, కొత్తపేట, సొరంగం పైను నివసించే కొండ ప్రాంత వాసులను అప్రమత్తం చేశారు. తుపాన్ వల్ల కొండ రాళ్ళ పడే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా ఉండాలని టూటౌన్ సిఐ సుబ్రహ్మణ్యం వారికి సూచించారు.

తుపానుతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-నందిగామ: మిచౌంగ్ తుపాను ప్రభావంతో నందిగామ ప్రాంతంలో పంటలకు ముప్పు వాటిల్లటంతో మాగాణి రైతులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. మాగాణి పంట కోతలకు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నందిగామ ప్రాంతంలో సుమారు 60 వేల ఎకరాలలో మాగాణి సాగైంది. వరి పంట పొట్టకు కోతలకు వచ్చింది. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి నందిగామలో వాతావరణం పూర్తిగా చల్లబడి చిరుజల్లులు పడుతుండటంతో మాగాణి రైతులు ఆందోళన చెందుతున్నారు. మాగాణి ఎకరానికి 30 నుండి 50 వేల రూపాయల వరకు రైతులు పెట్టుబడులు పెట్టారు. మాగాణి పనలు తడిస్తే వడ్లు రంగు మారే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. పత్తి రైతులకు కూడా తుపాను నష్టం కలిగిస్తుంది. పత్తి కాపుకు వచ్చి కాయలు పగిలి తెల్లగా వికసిస్తున్న తరుణంలో అకాల వర్షాల వల్ల పత్తి తడిసి నల్ల రంగు వేసి కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. అదే విధంగా మొక్కజొన్న, పసుపు పంటలకు తుపాను నష్టము కలిగిస్తుందని రైతులు వాపోతున్నారు. నందిగామ మండలంలో సుమారు వెయ్యి ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశారు. అదే విధంగా రెండు వందల ఎకరాలలో పసుపు సాగు చేశారు. మినుము, పెసర పంటలకు తుపాను ముప్పు పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తిరువూరు: తుపాన్ దెబ్బకు రైతులు కుదేలవుతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులను అధిగమించి వరి పంటను పండించిన అన్నదాతలు దాన్ని కాపాడుకునేందుకు పడే కష్టాలు వర్ణణాతీతం. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లో కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. ధాన్యాన్ని దాచుకోవటానికి స్థలం లేక, మరోవైపు కొనేవాళు లేక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆర్‌బికె కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పిన అధికారులు వాటిని పూర్తిగా అందుబాటులోకి తీసుకురాకపోవటంతో ముఖ్యంగా ఏ ఆసరాలేని సన్న, చిన్నకారు రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి వేసిన దగ్గర నుండి వర్షాలు పడకపోవడంతో మోటార్ల ద్వారా పంట పొలాలకు నీటిని కొనుగోలు చేసి కాపాడుకుని కోసిన ధాన్యాన్ని కల్లాల్లో తడవకుండా పరదాలు కప్పుతున్నారు.

కంచికచర్ల: తుపాన్ ప్రభావంతో సోమవారం ఉదయం నుండి వర్షం కురుస్తూనే ఉంది. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు సెలవు ప్రకటించాయి. ఈదురుగాలులకు వరి పంట నేలకొరిగింది.

ప్రజాశక్తి-విస్సన్నపేట: మండలంలోని నరసాపురం, పుట్రేల గ్రామాల్లో వరి పొలాలను, కుప్పలను విస్సన్నపేట డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శశికళ, మండల వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మీ సోమవారం పరిశీలించారు. రైతులు మరో మూడు రోజులు వరి కోతలు ఆపాలని కోరారు. కల్లాలోని ధాన్యాన్ని వెంటనే సురక్షిత ప్రాంతాలకు, ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా మిల్లులకు తరలించాలని అన్నారు.



తిరువూరులో వరిపై పట్టాలు కప్పుతున్న కూలీలు

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ప్రజాశక్తి-కంచికచర్ల: తుపాన్ కారణంగా కంచికచర్ల మార్కెట్ యార్డులో ఈ నెల 6వ తేదీ వరకు సిసిఐ పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేసినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి కె.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. తుపాన్ ప్రభావం తగ్గిన తర్వాత సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు చేసే తేదీని ప్రకటిస్తామని, అప్పటి వరకు రైతులు ఎవరు పత్తి బోరాలు యార్డుకు తీసుకురావద్దని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి : సామినేని

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: తుపాన్ నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవటానికి సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు పాటించి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన డిసిపి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: తుపాన్ కారణంగా ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నదీతీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయడానికి రూరల్ డిసిపి అజిత వేజెండ్ల, క్రైమ్ ఎడిసిపి పి.వెంకటరత్నం ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి సోమవారం నందిగామ, జగ్గయ్యపేట సర్కిల్ పరిదిలోని నదీతీర ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. తుపాను ప్రభావాన్ని ప్రజలందరూ గమనించి ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన వారు పునరవాస కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అధిక నీటి ప్రవాహం ఉన్న రోడ్డులు, బ్రిడ్జిలు, వాగులు, నదులు దాటడానికి ఎవరు ప్రయత్నం చేయకూడదన్నారు. కృష్ణానదిలోకి వెళ్ళకూడదని, బలహీనంగా ఉన్న ఇంటి గోడలు, కరెంటు స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్స్, చెట్ల కింద ఉండకూడదని చెప్పారు. అన్ని మండలాల్లో, నదీతీర ప్రాంతాలలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఎసిపి కె.జనార్ధననాయుడు, జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.జానకిరామ్ , నందిగామ రూరల్ ఇన్స్పెక్టర్ ఐ.వి.నాగేంద్రకుమార్, నందిగామ టౌన్ ఇన్‌స్పెక్టర్ జె.ఆర్.కె.హనీష్ బాబు , చిల్లకల్లు ఎస్ఐ వి.కృష్ణబాబు పాల్గొన్నారు.



విస్సన్నపేటలో తడిసిన వరిని పరిశీలిస్తున్న అధికారులు

రైళ్లు, ఆర్‌టిసి సర్వీసులు రద్దు

ప్రజాశక్తి-విజయవాడ: తుపాను ప్రభావంతో ఎపిఎస్‌ఆర్‌టిసి పలు రూట్లలో వెళ్లాల్సిన 24 సర్వీసులను నిలుపుదల చేసింది. విజయవాడ నుంచి రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలకు, అలాగే చెన్నై వెళ్లాల్సిన పలు సర్వీసులను ఆపేశారు. తుఫాను కారణంగా ఆయా రూట్లలో చెట్లు విరగడం, రహదారులు సరిగా లేక పోవడం, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తూ రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పలు సర్వీసులను ఆపేసినట్లు స్థానిక పిఎన్‌బిఎస్ అధికారులు వివరిస్తున్నారు. సోమవారం రాత్రి 8 గంటల సమయములో విజయవాడ నుంచి బయలు దేరాల్సిన అమలాపురం, పార్వతీపురం, డీజిమెట్ల, మియాపూర్, కాకినాడ, నెల్లూరు, చెన్నై (సర్వీసు నెంబర్ 4060) ఇక్కడే ఆగిపోయాయి. అలాగే తుని 2 సర్వీసులు, విశాఖ రెండు సర్వీసులు, బెంగుళూరు (సర్వీసు నెంబర్ 3878), రాజమండ్రి రూట్లకు వెళ్లాల్సిన సర్వీసులను తుఫారు ప్రభావంతో మధ్యాహ్నం నుంచి విజయవాడ బస్‌స్టేషన్‌కు పరిమితం అయినట్లు అధికారులు వివరిస్తున్నారు. అదే విధంగా జగ్గయ్యపేట -కాకినాడ మధ్య నడిచే 3836 సర్వీసు నెంబర్ క్యాన్సిల్ అయినట్లు తెలిసింది. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని పలువురు వ్యక్తం చేస్తున్నారు. తుఫాను ప్రభావం ఆర్టీసిపై కూడా పడింది. అటు రాబడి ఆగిపోవడం, సర్వీసులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది. తుఫాను పరిస్థితిని బట్టి సర్వీసులను పునరుద్ధరించడం జరుగుతుందని అధికారుల నుంచి సమాచారం వినిపిస్తుంది.

తుపాను కారణంగా విజయవాడ రైల్వే జంక్షన్ మీదుగా చెన్నై, ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన 144 రైళ్లలను రైల్వే ఉన్నతాధికారులు రద్దు చేశారు. మరికొన్ని రైళ్లలను దారి మళ్లించారు. రైళ్ల రాకపోకలు ఒక్క సారిగా ఆగిపోవడంతో వ్యాపార, ఇతర వర్గాల ప్రజలు ప్రైవేటు ట్రావెల్స్‌కు అదనంగా ఛార్జీలు చెల్లిస్తూ వారి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వస్తోంది.



జగ్గయ్యపేటలో కల్లాల్లో ఉన్న వరి



వేదాద్రి ఘాట్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న డిసిపి అజిత

పునరావాస కేంద్రాలకు తరలించాలి

- రెవెన్యూ, పోలీస్, ఫిషరీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి
- కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ : బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం బలపడి తుఫానుగా మారి అది మరింత తీవ్ర రూపం దాల్చి నెల్లూరు బాపట్ల మచిలీపట్నం ప్రాంతాలలో తీరం దాటవచ్చునని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో జిల్లా యంత్రాంగం మొత్తం దివిసీమకు తరలివచ్చింది. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రాజబాబు ఎస్పీ జాషువా ఎమ్మెల్యే రమేష్ బాబు తో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుఫాను దివిసీమ ప్రాంతంలో తీరం దాటవచ్చునని హెచ్చరిస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నిర్మించడంతోపాటు తాసిల్దార్ ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి ఎటువంటి ప్రాణ నష్టము జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.



ముఖ్యంగా పునరావాస కేంద్రాల భవనాలను పటిష్టమైన భవనాలు ఎంపిక చేయాలని, అందులో మౌలిక వసతులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ త్రాగునీరు శానిటేషన్ వైద్య సదుపాయం కల్పించడంతోపాటు వారికి మంచి భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు, గర్భిణీలు పసిబిడ్డలు ఉంటే వారికి వైద్యశాలలో వసతి కల్పించాలని సూచించారు మొత్తం తుఫాను ప్రభావం గురయ్యే ఏడు మండలాల్లో 57 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు, తుఫాను గాలి వేగం 100 నుండి 110 కిలోమీటర్ల వరకు ఉంటుందని హెచ్చరిస్తున్న నేపథ్యంలో రహదారులపై చెట్లు విద్యుత్ స్తంభాలు కూలే అవకాశం ఉన్నందున తక్షణమే వాడిని తొలగించేందుకు సంబంధిత శాఖ అధికారులు మొబైల్ టీవీలను ఏర్పాటు చేసుకొని సిద్ధంగా ఉండాలని సూచించారు, నాగాయలంక కోడూరు మండలాలకు ఎన్డిఆర్ఎఫ్ టీమ్లను ఏర్పాటు చేశామన్నారు. రాబోయే 24 గంటలు ఎంతో ప్రమాదకరమైన కాలమని ఈ రాత్రి అంతా తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని నోడల్ అధికారులకు సూచనలిస్తూ ప్రత్యేక అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అధికారులు సూచనలను పాటించి పునరావాస కేంద్రాలకు తరలి రావలసిందిగా విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ పి జాషువా మాట్లాడుతూ అవనిగడ్డ కేంద్రంగా ఇప్పటికే ఎన్టీఆర్ తో పాటు 200 మంది పోలీసు సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. డి.ఎస్.పి ముగ్గురు సీఐల పర్యవేక్షణలో తమ సిబ్బంది సేవలందిస్తారన్నారు.కాగా జిల్లా డిపిసి అధికారి రాములు నాయక్ అవనిగడ్డ ప్రత్యేక అధికారిగా, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ పిఎస్ఆర్ ప్రసాదు నాగాయలంక కోడూరు ప్రత్యేక అధికారిగా, జిల్లా ఫారెస్ట్ అధికారి కే రాజశేఖర్‌రావు కోడూరు ప్రత్యేక అధికారిగా నియమించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పి శ్రీహరిబాబు ఆర్డీవో ఎం. వాణి లతోపాటు పోలీస్ రెవెన్యూ పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడూ పాఠశాలలకు సెలవు : డిఇఒ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : "మిచౌంగ్ "తుఫాను పరిస్థితి దష్ట్యా, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఉత్తర్వులు మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కష్ణా జిల్లాలోని అన్ని యాజ మాన్యాల పాఠశాలలకు (అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలకు) మంగళవారం కూడా సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తాహెర సుల్తానా తెలిపారు. కావున, జిల్లా లోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, అన్నీ యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.



తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న కొల్లు రవీంద్ర

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు ఇక్కట్లు : కొల్లు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : తుఫాన్ ప్రభావంతో చేతికి అందించిన పంట నీట మునగడంతో మచిలీపట్నం నియోజక వర్గం గుండు పాలెం, చిన్నాపురం తదితర ప్రాంతాల్లో పర్యటించి పంట పొలాలను మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొల్లు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ రోజు రైతాంగం కళ్ళలో నీళ్ల కనబడుతున్నాయని ఎంతగానో కష్టపడి పంట పండించుకుని ధాన్యం ద్వారా శ్రమకి ఫలితం వస్తుందినే సమయానికి తుఫాను వలన మొత్తం కూడా నీళ్లపలు అయిందన్నారు. దాదాపు వరి పంట దక్కింది పడిపోయి నీళ్లలో తేలుతు ధాన్యం కుళ్ళు పోతుందన్నారు. ఇది కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం అని అన్నారు.కాలువల్లో ఎప్పటికప్పుడు మట్టి తీయకపోవడం వలన ఎక్కడకక్కడ నీరు నిలిచిపోయి పంట పొలాలు పడిపోయే దానికి కారణమయ్యిందన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ పర్యటనలో గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, లంకె నారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో ప్రజాప్రతినిధుల పర్యటన

ప్రజాశక్తి-అవనిగడ్డ : తుఫాను ప్రభావం దివిసీమ ప్రాంతంలో అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ వారు హెచ్చరించడంతో దివిసీమలోని పలు రాజకీయ పార్టీల నాయకులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. సోమవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పార్టీ కార్యకర్తలతో కలిసి దివిసీమ ప్రాంతంలోని అనేక తీర ప్రాంత గ్రామాలను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అధికారులకు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు తుఫాను ప్రభావానికి గురికాకుండా సురక్షిత ప్రాంతాలకు పుంర్డవాస కేంద్రాలకు తరలి రావలసిందిగా కోరారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ కోడూరు నాగాయలంక మండలాల్లోని వీరప్రాంత గ్రామా లలో సంచరిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు పంటలను కాపాడుకోవాలని సూచించడంతోపాటు గతంలో నిర్మించిన తుఫాన్ షెల్టర్లు దెబ్బతిని ఉన్నందున ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా రైతుల ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని సూచించారు. కాక జనసేన పార్టీ నాయకులు అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు ఆధ్వర్యంలో లోతట్టు ప్రాంతాల్లో కాలనీలో సంచరిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండవలసిందిగా సూచించారు ఎటువంటి ఇబ్బంది ఎదురైన తాము అండగా ఉంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.





రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - మొవ్వ : మొవ్వ మండలం లోని చిన్న ముత్తేవి, ఆవిరిపూడి గ్రామాల్లో కౌలు రైతు సంఘం నాయకులు శీలం నారాయణరావు పర్యటించి వరి పొలాల్లో తడిసిన వరి పనాల్ని పరిశీలించారు.మిచాంగ్ తుఫాను కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోసిన వరి పనలు నీటిలో తేలుతున్న నేపథ్యంలో రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారని సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పందించి దెబ్బతిన్న పంటలను నమోదు చేయించి రైతు, కౌలు రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి కౌలు రైతు సంఘం తరపున శీలం నారాయణరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు శివ, వెంకటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించండి : జెసి

ప్రజాశక్తి -మొవ్వ : మిచౌంగ్ తుఫానుతో రైతులు నూర్చుకొని కాటాలు వేసి బస్తాలకెత్తిన ధాన్యాన్ని సత్వరం వాహనాల ద్వారా ఆయా మిల్లర్లకు పంపిణీ చేయడంలో అలసత్వం వహించవద్దని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ సూచించారు. ఆమె సోమవారం సాయంత్రం ఆకస్మికంగా మొవ్వ మండలంలోని భట్ల పెనుమర్రులోని ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు నూర్చుకొన్న ధాన్యం తడవకుండాఅవసరమైతే సమీపంలోని మార్కెట్ యార్డ్ గోదాములలో తాత్కాలికంగా భద్రపరచాలని సూచించారు. మండలంలో ధాన్యాన్ని ప్రస్తుతం ఏలూరు జిల్లాలోని కైకలూరుకి, గుంటూరు జిల్లాలోని మిల్లులకు తరలించారు సంప్రదించామని స్థానిక అధికారులు ఆ ప్రాంతాలకు పంపే ఏర్పాటు చేయాలని చెప్పారు. మిల్లులకు ధాన్యం సరఫరా చేసే లారీలకు ముందస్తుగా రైతులు చెల్లించుకొనే విధంగా అవగాహన కల్పించాలని ఆమె కొనుగోలు కేంద్ర సిబ్బందికి సూచించారు. ధాన్యం నగదు చెల్లించేటప్పుడు లారీకిరాయిని కూడా కలిపి చెల్లించాలని ఆమె సిబ్బందికి సూచించారు. మొవ్వ మండలంలో మిల్లులకు పంపించాల్సిన ధాన్యం ప్రస్తుతం వెయ్యి మెట్లు పైగా ఉంటుందని తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ ఆమె దష్టికి తెచ్చారు. ఇదిలా ఉండగా అదే సమయానికి ఆ గ్రామానికి విచ్చేసిన పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ రైతుల ఇబ్బందులను ఆమెదష్టికి తెచ్చి అధిక సంఖ్యలో వాహనాలను సరఫరా చేయించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కంచర్ల శివప్రసాద్, డిప్యూటీ తాసిల్దారు సిహెచ్ గోపాలరావు తదితరులకు ధాన్యం కొనుగోలు విషయంలో పలు సూచనలు ఇచ్చారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి

ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : తుఫాన్ కారణంగా ప్రజలు ,రైతులు ఎలాంటి ఇబ్బందులకు, ప్రమాదాలకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో దారపు శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కవుతరం గ్రామ సచివాలయం 1, సచివాలయం 2 అధికారులతో సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు తగు జాగ్రత్తలు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, పంచాయితీ సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పట్టాలు కప్పిన ధాన్యం పరిశీలిస్తున్న దృశ్యం



వర్షానికి తడిసిన పనలను పరిశీలిస్తున్న దృశ్యం

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-బంటుమిల్లి : తుఫాన్ ప్రభావానికి దెబ్బతిని నష్టపోయిన రైతులు, కౌలు రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలకు బంటుమిల్లి మండ లంలో కోత కోసిన వరి పొనలు నీట మునిగాయన్నారు. కావున ప్రభుత్వం ప్రకటించినట్లు తడి ధాన్యం తో పాటు పనల మీద తడిసి దెబ్బతిని మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 90 శాతం సబ్సిడీపై అపరాలు ఇవ్వాలని, రైతులకు టార్పాలిన్లు కూడా 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలని కోరారు.

పునరావాస కేంద్రాల పరిశీల

కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని స్వతంత్రపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద, పాలకాయతిప్ప గ్రామంలో తుఫాన్ షెల్టర్ వద్ద అధికారులు ఏర్పాటుచేసిన పునరావస్తు కేంద్రాలను కోడూరు మండలం ప్రజాప్రతినిధులు సందర్శించి తుఫాను బాధితుల బాగోగులను తెలుసుకుని భోజనం వసతి ఏర్పాట్లు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండలం జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, కోడూరు పిఎసిఎస్ అధ్యక్షులు పరిసే మాధవరావు, హంసలదీవి గ్రామపంచాయతీ సర్పంచ్ కొక్కిలిగడ్డ బిక్షాలు, ఎంపీటీసీ బడే హేమ గంగాధర్, వార్డ్ మెంబర్ వెన్న ప్రసాద్, చిలకలపూడి ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : మిచౌంగ్ తుపాను నేపథ్యంలో అధికారులు నిరంతరం అప్రమత్తంతో పంట, ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు ఆదేశించారు. తుపానును దష్టిలో పెట్టుకుని తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఇప్పటికే రైతులు వరికోతలు చేపట్టకుండా నివారించినట్లు చెప్పారు. జిల్లాలో 41,163 హెక్టార్లలో వరి సాగవ్వగా, 6,520 హెక్టార్లలో వరికోతలు పూర్తయినట్లు తెలిపారు. 45,108 టన్నుల ధాన్యం దిగుబడి రాగా, దీనిలో 12,993 టన్నులు బహిరంగ మార్కెట్ ద్వారా రైతులు అమ్ముకున్నారని చెప్పారు. మరో 28 వేల టన్నులు గోడౌన్లకు, సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. 2,391 టన్నులు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు. వాతావారణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఆదివారం 324 టన్నులు ఆఫ్‌లైన్, 200 టన్నులు ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసి రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. 1200 టన్నుల ధాన్యం కుప్పలు వేసి ఉందని, వాతావారణం అనుకూలించిన వెంటనే తేమ శాతం ఉన్నా ఆర్‌బికెల ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా, జాయింట్ కలెక్టర్ డా.పి.సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణెమ్మ, ఉద్యాన అధికారి బాలాజీ కుమార్, జిల్లాలోని ఆర్‌డిఒలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించండి : విఎంసి కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : విఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 23 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుకున్న ఈ ఫిర్యాదులకు సత్వర పరిష్కారాలు చూపాలని సంబంధిత విభాగాల అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.వి సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ రావు, సిటీ ప్లానర్ జీవిజీఎస్‌వి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) వెంకటలక్ష్మి, ఎడి హెచ్ శ్రీనివాస్, ఏ ఓ నరసింహ మూర్తి, ఆర్‌ఎఫ్ఒ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

తుపాను నేపథ్యంలో ధాన్యం తరలింపు



విజయవాడ రైల్వేస్టేషన్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

ఎన్‌టిఆర్ జిల్లాలో 41,163 హెక్టార్లలో వరి సాగవ్వగా, 6,520 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. 45,108 టన్నుల ధాన్యం దిగుబడి రాగా, దీనిలో 12,993 టన్నులు బహిరంగ మార్కెట్ ద్వారా రైతులు అమ్ముకున్నారు. మరో 28 వేల టన్నులు గోడౌన్లకు, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 2,391 టన్నులు ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేశారు. వాతావారణ పరిస్థితుల దృష్ట్యా ఆదివారం ఆఫ్‌లైన్ ద్వారా 324 టన్నులు, ఆన్‌లైన్ ద్వారా 200 టన్నులు కొనుగోలు చేసి వర్షానికి తడవని ప్రాంతాలకు తరలించారు. 1200 టన్నుల ధాన్యం ఇంకా కుప్పలు వేసి ఉంది.

సహాయక చర్యలకు కాల్ చేయండి : ఎస్‌పి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : తీవ్రమైన తుపాను కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కృష్ణాజిల్లా ఎస్‌పి పి.జాషువా కోరారు. పోలీసుల సహాయం, సేవలకుగాను 112, 100, 9491068906, 8332983792 ఫోన్ నెంబర్లకు కాల్ చేయొచ్చని పేర్కొన్నారు.

ధాన్యాన్ని రక్షించండం : ఎంపి బాలశౌరి

రైతుల ధాన్యాన్ని రక్షించే విషయంలో అధికారులు అప్రమత్తత వహించాలని బందరు ఎంపి వి.బాలశౌరి ఒక ప్రకటనలో కోరారు. ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి, గోడౌన్లకు తరలించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని విజ్ఞప్తి చేశారు.

కృష్ణాజిల్లాలో 24 గంటలు వైద్య సేవలు : మంత్రి

కష్ణా జిల్లాలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని రాష్ట్ర గహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. పిహెచ్‌సిలు, ఇతర ప్రభుత్వాస్పత్రుల్లో 24 గంటలూ వైద్యులు, ఇతర వైద్య ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. మందులతోపాటు పాము కాటు నివారణ మందు కూడా సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో 5.14 మిమీ వర్షపాతం నమోదు

ప్రజాశక్తి-విజయవాడ : తుపాను ప్రభావంతో ఎన్‌టిఆర్ జిల్లాలో ఆదివారం రాత్రి నుండి తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం తెల్లవారుజాము ఈదురుగాలులు ఈదురు గాలులు ప్రారంభమయ్యాయి. ఎన్‌టిఆర్ జిల్లాలోని 20 మండలాల్లో సగటున 5.14 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో మొత్తంగా 102.8 మిల్లీమీటర్లు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. విజయవాడ సెంట్రల్ మండలం 11.4, పశ్చిమ మండలం 11.4, ఉత్తర మండలం 10.8, తూర్పు మండలం 10.2, రూరల్ మండలం 11, ఇబ్రహీంపట్నం 10, మైలవరం 6.4, విసన్నపేట 5.4, జి.కొండూరు 5, రెడ్డిగూడెం 3.6, ఎ.కొండూరు 3.4, తిరువూరు 3.2, నందిగామ 2.2, కంచికచర్ల 2.2, వీరులపాడు 1.8, జగ్గయ్యపేట 1.6, చందర్లపాడు 1, పెనుగంచిప్రోలు 0.8, గంపలగూడెం 0.6, వత్సవాయి మండలంలో 0.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

అవుట్‌ఫాల్ డ్రైన్ల వద్దకు చిన్నారులను పంపొద్దు : విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్

విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం నగరంలోని విఎంసి ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో తుపానుపై



రైళ్ల రద్దుతో విజయవాడ రైల్వేస్టేషన్లోనే ప్రయాణికులు

అధికారులతో సమీక్షించారు. ప్రజలను అప్రమత్తం చేయాలని, అవుట్‌ఫాల్ డ్రైన్ల వద్దకు పిల్లలను పంపొద్దని కమిషనర్ సూచించారు. నగరంలో కొత్త బానర్లు, హోర్డింగ్లు పెట్టొద్దని, ప్రమాద భరితంగా ఉన్న వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొండ ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలు తమకు ఎదురయ్యే సమస్యలను ల్యాండ్‌లైన్ నెంబర్ 0866–2422515, టోల్ ఫ్రీ నెంబర్ 18004252000, వాట్సాప్ నెంబర్ 8181960909 ద్వారా తెలియజేయచ్చని పేర్కొన్నారు. ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

అవుట్ ఫాల్ డ్రైన్లలో చెత్త తొలగింపు

మిల్క్ ప్రాజెక్ట్, గుణదల, గుంట తిప్ప వద్ద ఉన్న అవుట్‌ఫాల్ డ్రైన్లను విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. అవుట్‌ఫాల్ డ్రైన్లలో ఉన్న చెత్తను జెసిబిలతో తొలగించడాన్ని పర్యవేక్షించారు. లోతట్లు ప్రాంతాల ప్రజలను వెంటనే గుర్తించి వారికి పునరావాస కేంద్రాల్లో వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈపర్యటనలో ఇఇ నారాయణమూర్తి, జోనల్ కమిషనర్ రవి చంద్ పాల్గొన్నారు.

అవుట్‌ఫాల్ డ్రైన్‌ను పరిశీలిస్తున్న విఎంసి కమిషనర్



స్పందన అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించండి : జెసి

ప్రజాశక్తి - విజయవాడ : స్పందన ద్వారా స్వీకరించిన ఆర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపి ఆర్జీదారుడు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈకార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడి కె.శ్రీనివాస్, ఐసిడిఎస్ పీడి జి. ఉమాదేవి, డియంహెచ్‌వో డా. యం సుహాసిని, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ యం విజయభారతి, జిల్లా విద్య శాఖ అధికారిని సివి రేణుక, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి యం. రుక్మాంగదయ్య, హౌసింగ్ పిడి రజినీ కుమారి, పశు సంవర్ధక శాఖ జెడి కె. విద్యాసాగర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీ కుమార్, డ్వామా పిడి జె. సునీత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జెసి

మనస్సుతో విని మంచి మార్గం చూపండి : కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : సమాజంలో బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న చెప్పుకోలేని సమస్యలను మనస్సుతో విని మంచి పరిష్కార మార్గం చూపడం ద్వారా ప్రతికూల ఆందోళనతోకాకుండా ప్రశాంతమైన జీవితాన్ని గడిపేందుకు కషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీ రావు కోరారు. మహిళాల సమస్యల పరిష్కారానికి ఏర్పడిన మనశ్విని కాన్సెప్ట్ పోస్టరును సోమవారం ఆయన నగరంలోని తన విడిది కార్యాలయం వీడియోకాన్ఫరెన్స్ హాల్లో నగరపోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా, జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్‌లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ “మేము మీతో ఉంటాం...మీకు సహాయం చేస్తాం” అంటూ మనశ్విని కాన్సెప్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళ కమిషన్ మాజీ డైరెక్టర్ ఆర్.సూయజ్ మాట్లాడుతూ మహిళలు బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను మనస్సుతో విని పరిష్కారం మార్గం చూపాలనే ఏకైక లక్ష్యంతో మనశ్విని కాన్సెప్ట్ను స్వచ్ఛందగా ప్రారంభించేందుకు ముందుకు వచ్చినట్లు చెప్పారు. లైంగిక వేధింపులు, అత్యాచారం, గహ హింస వంటి చెప్పుకోలేని సమస్యలతో బాధపడే బాలికలు, మహిళలు మనశ్విని దష్టికి తీసుకువస్తే వారికి పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మనశ్విని కాన్సెప్ట్ ద్వారా మహిళాలలో ఆందోళన, సమస్యలు పరిష్కారం, ఆత్మహత్య ధోరణుల నివారణలపై కౌన్సెలింగ్, బంద చర్చలు, క్షేత్రస్థాయి పర్యాటనలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నామన్నారు. మనశ్వినితో మనస్సు పంచుకునే మహిళల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని, సమస్యలు ఎదుర్కొంటున్న వారు ఇన్స్టాగ్రామ్ లేదా 9701056808 నెంబర్ ద్వారా సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ పాజెక్ట్ డైరెక్టర్ జి.ఉమాదేవి, పాత ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ మానసిక వైద్యురాలు డా. స్వరాజ్య లక్ష్మి, చేయూత ఎడ్యుకేషన్ సెంటర్ ప్రిన్సిపల్ టి. కష్ణకుమారి, ప్యాషన్నెట్ చెంజ్ మేకర్ ఎ. అనూష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని యస్ నాగ మణెమ్మ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ ఎస్.డిల్లీరావు తదితరులు

మొదటిపేజీ తరువాయి

అలజడి

ఇబ్బందులు పడుతున్నారు. తుపాను తీవ్రత పెరుగుతుండటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తం అయింది.

63 పునరావాస కేంద్రాలకు 3,228 మంది తరలింపు

జిల్లాలోని ఏడు తీర ప్రాంత మండలాల్లో 63 తుపాను పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసి 3,228 మందిని తరలించారు. 1442 మందిని మచిలీపట్నం మండలంలోని 25 పునరావాస శిబిరాలకు, 758 మందిని నాగాయలంకలోని 16 శిబిరాలకు, 697 మందిని కోడూరులోని ఆరు శిబిరాలకు, 83 మందిని కృత్తివెన్నులోని ఐదు శిబిరాలకు, 74 మందిని అవనిగడ్డలోని నాలుగు శిబిరాలకు, 12 మందని మోపిదేవిలోని మూడు శిబిరాలకు, 132 మందిని బంటుమిల్లి మండలంలోని 4 సహాయ శిబిరాలకు తరలించారు.

జనజీవనం అస్తవ్యస్తం

తుపాను పరిస్థతులతో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. సోమవారం ఉదయం నుంచి తెరిపిలేకుండా వర్షపు జల్లులు కురవడంతో ప్రజలు రోడ్లపైకి రాలేదు. చాలా వరకు దుకాణాలు తెరవలేదు. చిరు వ్యాపారాలు, హాకర్ల, తోపుడు బళ్ల వ్యాపారాలు సాగలేదు. ఆర్టీసిలో ప్రయాణీకులు సంఖ్య తగ్గిపోయింది.

సహాయక చర్యలు చేపట్టాలి

సౌకర్యాలు అందించాలని సూచించారు. తేమశాతం నిబంధనలు సడలించి ఆఫ్‌లైన్‌లో ధాన్యం సేకరిస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అనేక గ్రామాల్లో ధాన్యం రాసులు నిల్వ ఉండిపోయాయని పేర్కొన్నారు. ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉందని కారణాన్ని చూపుతూ కంకిపాడు మండలం పునాదిపాడు, జగన్నాధపురం గ్రామాల్లోని సన్నకారు, చిన్నకారు, కౌలు రైతులు నూర్చిన ధాన్యం తరలించలేదని, వర్షాలకు రాసుల కిందకు నీరు చేరి ధాన్యం నాణ్యత దెబ్బతిని రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రైస్ మిల్లుల వద్ద గోడౌన్‌లలో ఖాళీ లేదని చెబుతూ రవాణా వాహనాల నుంచి సకాలంలో ధాన్యం లోడులు దిగుమతి చేసుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యం వెంటనే మిల్లులకు తరలించేందుకు, మిల్లుల వద్ద ఉన్న వాహనాల్లోని ధాన్యం వెంటనే దిగుమతి అయ్యేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజధాని రైతులకు ఊరట

వస్తుందా లేదా అన్నది తెలియడంలేదు. ఈఏడాది వార్షిక కౌలు కూడా ప్రభుత్వం ఇంత వరకు రైతులకు ఇవ్వలేదు. రిటర్నుబుల్ ప్లాట్ల అప్పగింతలో జరిగిన జాప్యం వల్ల రైతులకు ఆర్థికంగా ఎంతో నష్టం జరిగింది. ఈనేపథ్యంలో అమరావతి రైతులు అన్ని స్థాయిలో ఇప్పటికే వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ఆందోళనలను కొనసాగించారు. తాజాగా కేంద్రం ఇచ్చిన ప్రకటనతో అమరావతికి ఎటువంటి ఢోకా లేదని రైతుల్లో ధీమా వ్యక్తమవుతోంది.



మిల్లర్లతో మాట్లాడుతున్న రమేష్ బాబు

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-చల్లపల్లి : తుఫాను నేపథ్యంలో రైతులు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు రైస్ మిల్ యాజమానులకు సూచించారు. చల్లపల్లి, ఘంటసాల మండలాల్లోని రైస్ మిల్లులను ఆయన సోమవారం సందర్శించారు. ధాన్యం తేమ శాతం ఉన్నా పట్టించుకోవద్దనీ,రైతులు తీసుకు వచ్చిన ధాన్యం రైస్ మిల్‌లో అన్ లోడ్ చేసుకో వాలన్నారు. రైస్ మిల్లర్లు, అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ౖరెతు విభాగం జోనల్ ఇంచార్జి కడవకొల్లు నరసింహారావు, చల్లపల్లి తహసీల్దార్ కె.గోపాలకష్ణ, ఏఓ సాయి సింధు, ఏఎంసీ ౖచైర్మన్ వేమూరి వెంకట్రావు ఉన్నారు.



అరటి రైతులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-మోపిదేవి : తుపాను నేపథ్యంలో అరటి తోటల రైతులు పంట విషయంలో జాగ్రత్తవహించాలని అవనిగడ్డ ఉద్యాన శాఖ అధికారి రమేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రెండు,మూడు నెలలు వయసు ఉన్న పిలక తోటలలో వర్షపు నీరు నిలవ ఉన్నప్పుడు దుంప కుళ్ళిపోయి మొక్కలు పనికిరాకుండా పోయే అవకాశం ఉందని, వర్షపు నీటిని బయటకు తరలించిన తర్వాత తేలికపాటి దుక్కి దున్ని కొత్త పిలకలు నాటుకోవాలన్నారు. ఐదు ఆరు నెలల వయసున్న తోటలు ఒక ఐదు రోజులు పాటు నీటిలో ఉన్న తట్టుకుంటాయన్నారు.వర్షం అనంతరం నీటిని త్వరగా బయటికి తరలించి ఒక్కోమొక్కకు ఒక 100 గ్రాముల యూరియా 80 గ్రాములు పొటాష్ ఎరువులు అందించి అధిక తేమబారం నుంచి మొక్కలను కాపాడుకో వచ్చన్నారు. అరటి తోటలపై ఆకుమచ్చ తెగులు నివారించడానికి ప్రోఫియోకొనజైల్ ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు.

వైసిపి పాలనలో యువత భవిష్యత్తు అంధకారం : ఆళ్ల

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న అంధ పాలనతో రాష్ట్ర జనాభాలో కోటిన్నర పైగా ఉన్న యువత భవిష్యత్తు అంధకారంగా మారిందని సీనియర్ తెలుగుదేశం పార్టీ నేత ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు అన్నారు. రంగన్న గూడెం గ్రామంలో సోమవారం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొవ్వ వేణుగోపాల్ అధ్యక్షతన గ్రామ తెలుగు యువత నూతన కమిటీని ఎన్నుకునేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆళ్ళ గోపాలకష్ణారావు మాట్లాడుతూ అధికారం లోకి వస్తే 2.30 లక్షల ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేస్తామని, ప్రతి ఏడాది జనవరి మొదటి వారంలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటలు నీటి మూటలుగా మారాయన్నారు. ఎంపిటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ గ్రామ టిడిపి అధ్యక్షులు మొవ్వా వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం : కలెక్టర్




ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మిచౌంగ్ తుఫాను పరిస్థితిని ఎదుర్కొనేందుకు కష్ణాజిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆయా జిల్లాల్లో తుఫాన్ పరిస్థితులు ఎదుర్కొనేందుకు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎస్పీ పి జాషువా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్సో పాల్గొని కష్ణాజిల్లాలో తుఫాన్ పరిస్థితులు తీసుకున్న చర్యలు ముఖ్యమంత్రికి వివరిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కష్ణాజిల్లాలో తుఫాన్ ప్రభావానికి గురయ్యే 7 మండలాల్లో లోతట్టు ప్రాంతాల నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. 64 సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, ఇప్పటివరకు 2 వేల మందిని రిలీఫ్ క్యాంపులకు తరలించినట్లు, ఈ ప్రక్రియ కొనసాగుతున్నదని, సోమవారం సాయంత్రానికి మొత్తం 8 వేల మందిని రిలీఫ్ క్యాంపులకు తరలించుటకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రిలీఫ్ క్యాంపులలో ఆహారం, తాగునీరు, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మత్స్యకార గ్రామాల్లో మత్స్యకారులను ఒప్పించి రిలీఫ్ క్యాంపులకు తరలిస్తున్నట్లు తెలిపారు. నాగాయలంక మండలంలో ఏడు దీవులలో 4500 మంది జనాభా ఉన్నారని, వీరిని మెయిన్ ల్యాండ్ కు షిఫ్ట్ చేయుటకు మోటార్ బోట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ మీడియా ప్రతినిధులతో తో మాట్లాడుతూ రిలీఫ్ క్యాంపులకు వచ్చిన వారు ఇళ్లకు వెళ్లేటప్పుడు కుటుంబంలో ఒక వ్యక్తి ఉంటే రూ వెయ్యి రూపాయలు, ఒక్కో కుటుంబానికి 2 500/ రూపాయలు చొప్పున, తుఫాన్ కు దెబ్బతిన్న పూరి గుడిసెకు 10 వేల రూపాయలు చొప్పున ఇచ్చి, వారు గుడిసెలు పునర్నిర్మించుకొనుటకు అధికారులు సహకరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. మచిలీపట్నం, అవనిగడ్డలలో రెండు రాష్ట్ర విపత్తు నివారణ సహాయక దళం(ఎస్డిఆర్ఎఫ్) బందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.డిఆర్ఓ పెద్ది రోజా, జడ్పీ సీఈవో జ్యోతి బసు, బందరు ఆర్డిఓ ఎం వాణి దీనివల్ల సంబంధిత శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం కష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9 వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కష్ణా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి అరుణ సారిక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు మరియు ఏలూరు జిల్లాలోని నూజివీడు, కైకలూరు కోర్టుల పరిధిలో ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించ బడుతుందన్నారు. ఈ సందర్భంగా రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద క్లైములు మరియు అని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకొనవచ్చును అని తెలిపారు. కనుక కక్షిదారులు తమ లాయర్లు ను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కృష్ణాజిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె వి.రామ కష్ణయ్య విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ, నూజివీడు, నందిగామ, అవనిగడ్డ, కైకలూరు, గన్నవరం, తిరువూరు, జగ్గయ్యపేట, బంటుమిల్లి, మైలవరం, ఉయ్యూరు మరియు మొవ్వ కోర్టుల ఆవరణలో ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందన్నారు.

హేలాపురి బాలోత్సవ్‌కు విరాళం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు ,నిర్వాహక కార్యదర్శి జివిఎల్ నరసింహారావు కు సోమవారం హనుమాన్ జంక్షన్ మానవతా కార్యాలయంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరావు 25,000 వేల రూపాయలు అందజేశారు. మారుబోయిన గత మూడు సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం 25000 వేల రూపాయలు విరాళంగా హేలాపూరి బాలోత్సవమునకు అందిస్తున్నారు. గంటా సత్య నారాయణ ఇందిరా దేవి దంపతులు 5000 రూపాయలు, కూరెళ్ల సుభాచారి 2,500 రూపాయలు అందించారు..ఈ కార్యక్రమంలో ఇంకా మానవత సెక్రటరీ కళ్లేపల్లి నారాయణరావు, పివీ చలం,గోళ్ళ మల్లికార్జున రావు, జన్యావుల సత్య నారాయణ, దయాల ప్రభాకరరావు, వై. అర్జున్‌రావు,కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జివిఎల్ నరసింహారావుకు విరాళం అందజేస్తున్న మారుబోయిన కోటేశ్వరావు

త్వరలో ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం పాలక కమిటీ పదవీ కాలం నేటితో ముగిసిందని, త్వరలో ఎన్నికలు జరగనున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిటీ వైస్ ౖచైర్మన్ పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్‌లు మాట్లాడుతూ గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం పాలక కమిటీ పదవీ కాలం సోమవారంతో ముగిసిందన్నారు. మూడేళ్ళ పదవీకాలంఓ తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ స్టేడియం కమిటీ సభ్యులు ధన్యావాదాలు తెలిపారు. స్టేడియం కమిటీలో తమకు అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే కొడాలి నానికి కమిటీ సభ్యులు కృతజతలు తెలియజేశారు. ఈ సమావేశంలో స్టేడియం కమిటీ సభ్యులు బొగ్గరపు తిరుపతయ్య, వల్లభనేని ప్రసాద్, కిలారపు రంగప్రసాద్ తదిరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న స్టేడియం కమిటీ సభ్యులు

ప్రభుత్వ ఆదేశాలు పాటించని ప్రైవేట్ స్కూల్స్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరంలో సోమవారం కొన్ని ప్రైవేటు పాఠశాలలు నడిచాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ గన్న వరం డివిజన్ రాజేష్ చిల్లర రాజేష్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా కష్ణా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కష్ణా జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించగా గన్నవరం మండలంలోని నారాయణ స్కూల్ యాజమాన్యం క్లాసులు నడిపిందన్నారు. ఇదే విషయంపై యాజమాన్యాన్ని ప్రశ్నించగా తాము లోకల్ ఎంఈఓ దగ్గర్నుంచి పర్మిషన్ తెచ్చుకున్నట్లు చెబుతున్నారని, ఎంఇఓకు ఫోన్ చేయగా కనీసం లిఫ్ట కూడా చేయలేదన్నారు. కలెక్టర్ ఆదేశాలను లెక్క చేయకుండా వ్యవహరిస్తున్న ప్రైవేట్ యాజ మాన్యాల విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.





వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మిల్లులకు ధాన్యం చేరవేతలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - గుడివాడ : ధాన్యాన్ని మిల్లులకి పంపించి దిగుమతి చేసే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని సీపిఎం పట్టణ కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం రైస్ మిల్లు దగ్గరికి లారీలు వస్తే సోమవారం మధ్యాహ్నం వరకు ఒక్కొక్క రైస్ మిల్లు దగ్గర 15 నుంచి 20 లారీలు నిలబడిపోయి ఉన్నాయన్నారు. రైతులు, డ్రైవర్లు వర్షాలకి తడిసి అక్కడే ఆ లారీలు దగ్గర ఉన్న పరిస్థితి ఉందని, జిల్లా కలెక్టర్ దిగుమతులు అన్ని సాయంత్రం 6 లోపల పూర్తి చేయాలని చెప్పినా 6 గంటల లోపల దిగుమతి చేయకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతూ ఉన్న పరిస్థితి మిల్లుల వద్ద నెలకొందన్నారు. తుఫాన్ తీవ్రత వల్ల ఇంకా రైతాంగం నష్టపోయే పరిస్థితి ఉంటుందన్నారు. కాబట్టి వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకునే రైతులుకి మేలు చేసే పద్ధతులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం రైతు సంఘం సీనియర్ నాయకులు నీలం మురళీకష్ణా రెడ్డి, శొంఠి ఉమామహేశ్వరరావు, ఐద్వా పట్టణ కార్యదర్శి పి రజిని, రైతులు, కౌలు రైతులు పాల్గొని ఆర్డీవో ఏఓకి మెమోరాండం అందించారు.

అక్కినేని ఆసుపత్రిలో షార్ట్‌సర్క్యూట్

- సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నగరంలోని భారతీ నగర్‌లోని అక్కినేని ఉమెన్స్ హాస్పటల్ భవనం పై అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్క సారిగా సోమవారం రాత్రి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. వెంటనే ఆసుపత్రి సిబ్బంది స్పందించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే రెండు ఫైరింజన్లు అక్కడకు చేరకుని మంటలను ఆర్పి అదుపులోకి తీసుకువచ్చారు. ఆసుపత్రి సిబ్బంది, ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు. ఆసుపత్రి సిబ్బంది వెంటనే పేషెంట్లను ఇతర ప్రాంతాలకు తరలించడంతో ముప్పు నుండి రక్షించుకోగలిగారని అన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఎన్‌టిఆర్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా గోపీనాయక్, వెంకటేశ్వరరావు



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఎస్‌ఎఫ్‌ఐ ఎన్టీఆర్ జిల్లా 50వ మహాసభ జగ్గయ్యపేట పట్టణంలోని ఎస్‌జిఎస్ కళాశాలలో ఈ నెల 2, 3 తేదీల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మందితో నూతన కమిటీని ఎనుకున్నారు. మహాసభలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించినట్లు రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ తెలిపారు. సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని, మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, జగ్గయ్యపేట, విజయవాడ కేంద్రంగా ప్రభుత్వ పీజీ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని, నియోజకవర్గానికి ఒక డిగ్రీ కళాశాల, ప్రతి మండలానికి జూనియర్ కళాశాల, పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ, జాతీయ విద్యా విధానం రద్దు తదితర తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ఎస్‌ఎఫ్‌ఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శిగా చిమట వెంకటేశ్వరరావు, అధ్యక్షులుగా గుగులోతు గోపీనాయక్, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె జాహిదా, ఎం.కుమార్‌నాయక్, టి.కుమార్‌స్వామి, సహాయ కార్యదర్శులుగా బి.మాధవ్, బి.యమున, ఎం.చరణ్, వై.కమల్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులుగా వై.చిన్నారి, సంతోష్, పి.ఈశ్వర్, ఎం.రాణి, వి.అజయ్ కుమార్, జి.రమ్య, బి.రాము, ఎం.గోపీ, సిహెచ్.మోహన్‌కృష్ణ, కె.ప్రదీప్, వై.కార్తీక్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సోమేశ్వరరావు, ప్రణీత, మండల నాయకులు ప్రణయ్, మహిళ సంఘం నాయకులు నాగమణి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక పశ్చిమ నియోజకవర్గంలో 40,46,51 డివిజన్లలో సోమవారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్నికి మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి సచివాలయంలో అమర్చిన పేదలకు చేకురిన లబ్ధిని వివరించే బోర్డును ఆవిష్కరించి సచివాలయం పరిదిలో ఏర్పాటు చేసిన జండా దిమ్మను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక పెద్దలతో ముఖ ముఖి కార్యక్రమం నిర్వహించారు. ప్రజలనే తీర్పు చెప్పమని కోరుతున్నాం ప్రజలు చక్కటి స్పందన ఇస్తున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు పరచని వ్యక్తి అని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా జగనన్న సంక్షేమం అభివద్ధి కార్యక్రమాలు చేపట్టిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు మంచి చేసిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల అంజనేయ రెడ్డి, 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్, మనోజ్ కొఠారి, గౌస్ మొహిద్దీన్, యశోధర్, కేసరి కష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో బెదిరిస్తున్నారు : నాగూర్

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలో మసీదులు, దర్గాలు, షాదీ ఖానాల అభివృద్ధిని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మరిచిపోయారని పీసీసీ ప్రధాన కార్యదర్శి షేక్ నాగూర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా ప్రకాశం బ్యారేజి వద్ద ఉన్న దర్గాలను, మసీదును అభివృద్ధి చేయాలని అనేక సార్లు ఎమ్మెల్యే కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని విమర్శించారు. చిట్టి నగర్ మోతి మసీదు, కుమ్మరి పాలెం షాదీఖానా, మీనార్ మసీదు తదితర ఆధ్యాత్మిక కేంద్రాలు అభివద్ధి చేస్తానని చెప్పి ఏమీ చేయలేదని తెలిపారు. అభివృద్ధి చేయలేక ముస్లిం మైనార్టీల మీద ఆక్రోశంతో షాజహూర్ ముసాఫిర్ ఖాన వద్ద తన అధికారాన్ని అడ్డంపెట్టుకొని ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని చూస్తున్నారన్నారు. దీనిపై తాను ప్రశ్నిస్తే అక్రమ కేసులతో బెదిరిస్తున్నారని ఆరోపించారు.

రోశయ్యకు నివాళి

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహం వద్ద సోమవారం రోశయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని రోశయ్య కాంస్య విగ్రహాన్ని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు, విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ఒకటో సచివాలయం పరిధిలో 6వ వార్డ్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మంజూరైన సుమారు రూ.2.50 లక్షలతో రాజ్యాలక్ష్మి ఇంటి వద్ద నుండి మెయిన్ రోడ్డు వరకు వేస్తున్న సిమెంట్ రోడ్డును సోమవారం స్థానికులతో కలిసి వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ పట్టణంలో అన్ని వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో సిమెంట్ రోడ్డులు, డ్రైన్స్ వేస్తున్నట్లు తెలిపారు.

కృష్ణా తరంగ్‌లో 'సిద్ధార్థ' విద్యార్థినుల ప్రతిభ



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: కృష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణా తరంగ్ - 2023 యువజనోత్సవాలలో నగరంలోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల డిగ్రీ విద్యార్థినలు పలు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరచి పతకాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన తెలిపారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కల్చరల్ విభాగం క్లాసికల్ సోలో పోటీలో ఎం.వి. సాయి వైష్ణవి, లైట్ వోక్ పోటీలో ఎం.వి. శ్రీ వైష్ణవి, క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంటల్‌లో డి.మహాలక్ష్మి పతకాలు సాధించారని తెలిపారు. గ్రూప్ సాంగ్, ఫోక్ ఆర్కెస్ట్రా ఫోక్ డ్యాన్స్ పోటీలలో తమ కళాశాల విద్యార్థినులు ద్వితీయ బహుమతులు సాధించారని తెలిపారు. లిటరసీ విభాగం నుండి ఎ.ఎం. సంకీర్తన ప్రథమ బహుమతి సాధించిందని తెలిపారు. ఫైన్ ఆర్ట్స్ విభాగం నుండి బి.శివ లాస్య , కార్టూనింగ్‌లో ప్రథమ బహుమతి సాధించిందన్నారు. అలాగే ఎం.సాయి వైభవి, క్లే మోడలింగ్‌లో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈపోటీలలో తమ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరచి సెకండ్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా కళాశాల సాంస్కృతిక కార్యక్రమాల సమన్వయ కర్త డాక్టర్ ఎం.సరళాదేవి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి. విజయలక్ష్మి విద్యార్థులను అభినందించారు.




సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-భవానీపురం: స్థానిక విద్యాధరపురం గుప్తా సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సెమీ క్రిస్టమస్ వేడుకల్లో జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్, నగర అధ్యక్షులు మరియు రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని సెమీ క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఏలూరి సాయి శరత్, మల్లెపు విజయలక్ష్మి, తిరుపతి సురేష్, బావిశెట్టి శ్రీనివాస్, మల్లెపు సురేష్, రావుల అఖిల్, సోమీ మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా కోటి దీపోత్సవం

ప్రజాశక్తి-వన్‌టౌన్: మిల్క్ ఫ్యాక్టరీ వద్ద గల సీవీఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కనున్న శివశక్తి నగర్‌లోని అస్త్ర అపార్ట్మెంట్ సెల్లారులో సోమవారం సాయంత్రం అత్యంత వైభవంగా కోటి దీపోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్తీక మాసం మూడో సోమవారం గూడేల వెంకట దుర్గా రమణ, నాగలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అపార్ట్మెంట్‌లోని మహిళలు పాల్గొన్నారు. పూజారి వంకా సురేష్ శర్మ వేద మంత్రోచ్చరణలతో ఎంతో భక్షిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకల్లో కార్తీక మాసం... అదీను సోమవారం కార్తీక దీపాలు, కార్తీక నోముల ప్రాధాన్యతని పూజారి వంకా సురేష్ శర్మ వివరించారు.



పేదలకు నిత్యావసరాలు పంపిణీ



ప్రజాశక్తి-వన్‌టౌన్: పేదలను ఆదుకోవడం సామాజిక బాధ్యత అని రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ప్రెసిడెంట్ బాయన బాబూజీ (బాబ్జి) అన్నారు. సోమవారం విజయవాడ కొత్తపేట బ్రాహ్మణ వీధి కోమలి విలాస్ సెంటర్ రామాలయం ఆవరణలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ప్రెసిడెంట్ బాయన బాబూజీ ఆధ్వర్యంలో 30 మంది పేదవారికి నిత్యావసర సరుకులు పంపిణి చేయటం జరిగింది. ఈ సందర్భంగా బాయన బాబూజీ మాట్లాడుతు తమ క్లబ్ తరుపున అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఇతరులకు సాయం అందచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాయన సునీత రాణి, రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ సెక్రటరీ గుండారపు శ్రీనివాసరావు, ట్రెజరర్ గణేష్ సుబ్బరావు, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పిళ్ళా మోహన్ రావు, డిస్ట్రిక్ట్ సెక్రటరీ మలపాక భాస్కర్, శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల కమిటీ సభ్యులు గురుమహంతు మహేష్, క్లబ్ వైస్-ప్రెసిడెంట్ అమానుల్లాహ్ పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన అవసరం



విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలను చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. ఆ కళాశాల జువాలజీ, జాతీయ సేవా పథకం, రెడ్‌రిబ్బన్ క్లబ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలోని డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ రక్తదానం తోటి మానవుల ప్రాణాలను నిలబెడుతుందన్నారు. ఇప్పటికీ సకాలంలో రక్తం అందక వేలాది మంది ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ రక్తాన్ని అందించి తోటివారి ప్రాణాలను కాపాడాలన్నారు. ముఖ్యంగా తమ కళాశాల విద్యార్థులు ప్రతి ఏటా వందలాది యూనిట్లు రక్తదానం చేసి సేవలందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్స్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ జీ. కష్ణవేణి, జువాలజీ విభాగాధిపతి ఎం. సాహితీ, బోటనీ విభాగాధిపతి ఎస్‌కే అలీబాషా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు వీ శేషగిరిరావు, డీ పవన్‌కుమార్, ఎన్ సాంబశివరావు, అధ్యాపకులు డాక్టర్ శకుంతల పాల్గొన్నారు.